# ముస్లింలకు కాంగ్రెస్ చేసింది శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, చిత్రంలో హోం మంత్రి మహమూద్ అలీ

- ఆర్‌ఎస్‌ఎస్‌లో పని చేసిన రేవంత్‌రెడ్డి మైనార్టీలకు ఏం చేస్తడు ?
- కేసీఆర్‌తోనే ముస్లింలకు ఆత్మగౌరవం : రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ
- ముస్లింలకు సోదరుడిగా పని చేశా :
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- 15వేల ఓట్లు కారుకే వేయాలి : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- ఘనంగా మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 21(నమస్తే తెలంగాణ) : 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ముస్లింల అభ్యున్నతికి చేసిందేమీ లేదని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహమూద్ అలీ, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజ్ సారయ్య హాజరయ్యారు. కాంగ్రెస్, బీజేపీ ముస్లింలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ముస్లింలు అంటే ఓల్డ్ సిటీ అని, అల్లర్ల కేరాఫ్ అని ముద్ర వేశారన్నారు. వారికి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. ఒకప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేసిన రేవంత్‌రెడ్డి టీడీపీలో చేరి, అనంతరం కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్‌లో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు పాటిస్తున్న రేవంత్‌రెడ్డి ముస్లింల సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎలా పనిచేస్తాడని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ముస్లిం, మైనార్టీల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. 204 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ఇప్పుడు డిగ్రీ కళాశాలలుగా మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. మైనార్టీ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు వైద్య విద్య, ఇంజినీరింగ్ అభ్యసిస్తున్నారన్నారు. ముస్లిం, మైనార్టీల విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.20లక్షలు అందిస్తున్నారని, దీంతో ఎంతో మంది మైనార్టీ బిడ్డలు విదేశాల్లో చదువుతున్నారన్నారు. రంజాన్ కానుకగా దుస్తులు, షాదీ ముబారక్‌కు రూ.లక్షా16వేలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ కలిసిన ప్రతిసారి మైనార్టీలకు నిధుల కొరత ఉందా ? ఏమైనా సమస్యలున్నాయా ? మరిన్ని నిధులు కేటాయించాలా ? అని తనను అడుగుతుంటారని గుర్తు చేశారు. ముస్లింల ప్రార్థన మందిరాలకు ప్రత్యేక నిధులు కేటాయించారని, ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికలు రాగానే మన జాతిని దెబ్బతీసే విషపూరిత మాటలతో రెచ్చగొట్టే పార్టీలు వస్తుంటాయని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. భూపాలపల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించుకోవాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చూడాలన్నారు. మన కోసం ఇంతగా ఆరాటపడే బీఆర్‌ఎస్‌ను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 15వేల మంది ముస్లిం, మైనార్టీ ఓటర్లు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ మీకు అండగా ఉంటాడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఇర్ఫాన్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు రహీం, యాకూబ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు కాసీం అలీ, మాజీ ఎంపీపీ గులాం అఫ్జల్, ముస్లిం, మైనార్టీ నేతలు సాదిక్, కరీం, అన్వర్, ముస్లిం, మైనార్టీలు పాల్గొన్నారు.

### ముస్లింలకు సోదరుడిగా పనిచేశా..

**ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

ముస్లిం, మైనార్టీల కుటుంబాల్లో సోదరుడిగా వారికి సేవలందించానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లిలో ఈద్గా నిర్మాణం చేశామన్నారు. మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించిన విషయం గుర్తు చేశారు. షాదీఖాన నిర్మాణం కోసం రూ.70లక్షల నిధులు కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయిస్తానన్నారు. నియోజకవర్గ పరిధిలో ముస్లింలు ఈద్గాలు, కబరస్తాన్‌లకు నిధులు కావాలని అడిగిన వెంటనే కేటాయించానని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ముస్లింలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ముస్లింలు బీఆర్‌ఎస్‌తోనే ఆత్మగౌరవంతో ఉంటున్నారన్నారు.

# కష్టాలు తెలిసిన నాగజ్యోతిని గెలిపించండి

- ఆమెతోనే ములుగు అభివృద్ధి
- కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించాలి : మంత్రి సత్యవతిరాథోడ్
- ములుగుపై గులాబీ జెండా ఎగురవేసి జగదీశ్వర్ కోరిక నెరవేర్చాలి : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా :
- ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

ములుగురూరల్, నవంబర్21 : కష్టాలు తెలిసిన నాగజ్యోతిని గెలిపించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. మంగళవారం రాత్రి మల్లంపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రచార ఆర్భాటాలు, సోషల్ మీడియా తప్ప కాంగ్రెస్ పేదలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కను ప్రజలు చిత్తు చిత్తు ఓడించి నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాగజ్యోతి తల్లిదండ్రులు పేదల కష్టాలు తీర్చడం కోసం జీవితాలను అంకితం చేసి కనుమూస్తే ప్రజల సంక్షేమం కోసం నాగజ్యోతి సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజల ముందుకు వచ్చిందన్నారు. మాయ మాటలు చెప్పే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మవద్దన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రూ.600 పింఛన్ ఇస్తూ ఇక్కడికి వచ్చి రూ.4 వేలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కరెంట్ వద్దనే కాంగ్రెస్ కావాలా..? 24గంటల కరెంట్ ఇచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. ధరణిని తీసేయమనే కాంగ్రెస్‌ను గోదావరిలో పాతిపెట్టాలన్నారు. సీఎం కేసీఆర్ అడిగిన వెంటనే మల్లంపల్లిని మండలంగా ప్రకటించిన విషయం గుర్తు చేశారు. వచ్చే సంవత్సరం వరకు మల్లంపల్లికి తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ కార్యాలయాలు వస్తాయని దీంతో మండల రూపురేఖలు మారుతాయన్నారు. దీనికి మల్లంపల్లి ప్రజలు బడే నాగజ్యోతి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాగజ్యోతిని గెలిపించుకుంటే సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవడంతో పాటు దివంగత జడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్ ఆశ నెరవేరుతుందన్నారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రం మొత్తం ములుగు వైపు చూస్తుందన్నారు.

**- గులాబీ జెండా ఎగురవేయాలి**

**ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

దివంగత జడ్పీ చైర్మన్, మల్లంపల్లి ముద్దుబిడ్డ కుసుమ జగదీశ్వర్ అకాల మరణం పార్టీకి, జిల్లా ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జగదీశ్వర్ సామాన్య జీవితం గడిపేవాడని, పార్టీ ఏ పిలుపు ఇచ్చినా చురుకైన పాత్ర పోషించేవాడని తెలిపారు. జగదీశ్వర్ కోరిక మేరకు మల్లంపల్లి గ్రామాన్ని సీఎం కేసీఆర్ మండలంగా ప్రకటించారన్నారు. జగదీశ్వర్ మరో కోరిక ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు.బడే నాగజ్యోతికి అధిక మెజార్టీని అందించాలని విజ్ఞప్తి చేశారు.

**సీఎం కేసీఆర్ ఆశీస్సులతో బరిలో నిలిచా..**

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి**

సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తాను మొదటి సారిగా ములుగు గడ్డపై ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటిసారిగా పోటీ చేస్తున్నానని బడే నాగజ్యోతి అన్నారు. ఎమ్మెల్యే సీతక్క రెండు పర్యాయాలు గెలిచి చేసిందేమీ లేదన్నారు. తాను ఈ ప్రాంత సమస్యలు తెలిసిన బిడ్డగా తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. 60ఏళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేసి గోస పడ్డామని, కేసీఆర్ వచ్చినంక అభివృద్ధి అంటే ఏంటో చూశామని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ వస్తే అరిగోస పడుతామని హెచ్చరించారు. మన ప్రాంతానికి అన్ని కావాలన్నా, సస్యశ్యామలంగా ఉండాలన్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రైతుల గురించి ఆలోచించే నాయకుడు, అందరి కోసం కొట్లాడే నాయకుడు కేసీఆర్ వెంట ప్రజలు ఉండాలని సూచించారు. మల్లంపల్లి ప్రజలు ఆదరించాలని కోరారు. ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. జదీశ్వర్ సతీమని రమాదేవి మాట్లాడుతూ తన భర్త చనిపోయే ముందు రోజు నాగజ్యోతికి టికెట్ వస్తుందని, ఎన్నికల్లో తనతో పాటుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తనకు చెప్పాడని గుర్తు చేశారు. నాగజ్యోతిని గెలిపించుకొని మల్లంపల్లి ప్రజలు రుణం తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌కో రాష్ట్ర చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, సర్పంచ్ చంద కుమారస్వామి, ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నాగజ్యోతి, చిత్రంలో మంత్రి సత్యవతి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

# ఆగం కావద్దు.. ఆలోచించి ఓటేయండి

- అభివృద్ధి చేసేవారిని ఆదరించండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు



అక్కెపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని రూరల్, నవంబర్ 21: 'ప్రజలు ఆగం కావద్దు.. తప్పుడు మాటలు నమ్మి మోసం చేసేవారిని ఎన్నుకోవద్దు..మళ్లీ ఒక్కసారి పొరపాటు చేస్తే ఐదేండ్ల పాటు గోసపడాల్సి వస్తది.' అంటూ బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. కేసీఆర్ పాలనలోనే సింగరేణి నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. మంగళవారం మండలంలోని అక్కెపల్లి, మల్లేపల్లి, సిరిపురం, బెస్తపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి ఐదేండ్ల కాలాన్ని వృథా చేసుకున్నామని ప్రజలు గ్రహించారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా సీఎం కేసీఆర్ పాలనను స్వాగతిస్తూ బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తామని చెబుతున్నారన్నారు. 2018లో కాంగ్రెస్‌కు ఓటేసి అభివృద్ధిని దూరం చేసుకున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించానని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు, ఎక్స్‌గ్రేషియా ఇప్పించానని గుర్తు చేశారు. అక్కెపల్లి గ్రామాన్ని ఇంకా సంస్థ స్వాధీనం చేసుకోలేదని, కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. సింగరేణి ఓసీపీల్లో ఈ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అలాగే పార్వతీ బరాజ్‌ను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి మోసపోవద్దన్నారు. అప్రమత్తంగా ఉండి అభివృద్ధి చేసేవారిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎరుకల తిరుపతమ్మ రవి, రాజయ్య, దండె ప్రసాద్, లక్ష్మి, నరేశ్‌రావు, మిట్టసత్యనారాయణ, ఎంపీటీసీలు మిరియాల ప్రసాద్‌రావు, పెగడ శ్రీనివాస్, జడ్పీటీసీ సుమలల, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి

**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి**



లక్ష్మారెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న గండ్ర జ్యోతి

గణపురం, నవంబర్ 21 : రాష్ట్ర సంపదను పెంచుతూ అన్ని వర్గాల ప్రజలకు పంచుతున్న కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్నాడన్నారు. మోరంచపల్లి వరదల్లో చిక్కుకున్న వారికి శక్తి మేరకు వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా సహాయం అందించామన్నారు. గండ్రను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పోలుసాని లక్ష్మీ నరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, నడిపెల్లి మధుసూదన్‌రావు, మేకల రజిత, ఒద్దుల అశోక్‌రెడ్డి, మారగాని సరస్వతీ శ్రీనివాస్, వీసం భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు ఉచిత వసతి

అనాథ పిల్లలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆర్ఫనేజ్ హోమ్‌లో చేర్పించాలని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ : డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్: పెద్ది వెంకటనారాయణ గౌడ్, ట్రెజరర్: బొమ్మినేని పాపి రెడ్డి కోరారు. అనాథ పిల్లలను అక్కున చేర్చుకొని చదువు మరియు వసతి సౌకర్యము ఉచితముగా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణకు హనుమకొండలోని రాంనగర్‌లో అధునాతనమైన భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు చెప్పారు. ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణకు కీ॥ శే॥ భోగవల్లి రాజేశ్వర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనాథ పిల్లల పాలనా, పోషణ చేపట్టేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంస్థపై నమ్మకంతో మేనేజింగ్ ట్రస్టీ : రిటైర్డ్ ఐపీఎస్ అధికారి : పాపారావు నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్లు వివరించారు. ఈ ఆర్ఫనేజ్ హోమ్ లో మొదటగా తల్లి, తండ్రి ఇద్దరు లేని పిల్లలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు, పిల్లలు లభించని పక్షంలో తల్లి లేదా తండ్రిగాని లేని నిరుపేద పిల్లలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. 6 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు గల అనాథ పిల్లలకు 30 మందికి ఉచితముగా చదువు మరియు వసతి సౌకర్యము కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్ఫనేజ్ హోమ్ నిర్వహణ విజయవంతమైతే హనుమకొండ సమీపంలోని అమ్మవారిపేటలో గల ట్రస్ట్‌కు సంబంధించిన సుమారు అర ఎకరం భూమిని విరాళంగా ఇవ్వడానికి మేనేజింగ్ ట్రస్ట్ : పాపారావు అంగీకారం తెలిపినట్లు పాలకవర్గం పేర్కొన్నారు.

INDIAN RED CROSS SOCIETY
# 2-7-941, Opp: Collectorate, Subedari, Hanumakonda.
Cell : 9154466212